సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



కామారెడ్డిలో గెలిచేదెవరు?

అందరి దృష్టి కామారెడ్డి నియోజకవర్గంపై కేంద్రీకృతమైంది. ఎవరు గెలుస్తారన్న దానిపై జోరుగా చర్చలు నడుస్తున్నాయి.

- 8లో ▸



కారు అద్దాలు ధ్వంసం

బాన్సువాడ మండలం బుడ్మిలో బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి కారుపై దాడి జరిగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.6 /18.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కంట్రోల్ రూం పరిశీలన



కామారెడ్డి క్రైం: మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఛిఫంగ్ ఆర్థర్ వర్చ్యాయో పరిశీలించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లాలో జరిగే సాధారణ ఎన్నికల పోలింగ్ తీరును పర్యవేక్షించారు. సి విజిల్‌కు వచ్చిన ఫిర్యాదుల గురించి తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎంసీఎంసీ అధికారులు సతీష్ కుమార్, సింహారావ్, సురేంద్ర కుమార్ ఉన్నారు.

మద్నూర్‌లో..



మద్నూర్: మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఆర్థూర్ వర్చ్యాయో సందర్శించారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన లైవ్ వీడియో చిత్రీకరణను పరిశీలించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి మనుచౌదరి, సిబ్బంది ఉన్నారు.

పార్టీ పైసల కోసం ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి క్రైం: ఓటు వేసిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఓ పార్టీకి చెందిన నాయకులు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన తోకల నారాయణ కుటుంబ సభ్యులు నలుగురికి మొత్తం రూ.4 వేలు ఇస్తామని ఓ పార్టీ నేతలు హామీ ఇచారు. అయితే రూ. 2 వేలు మాత్రమే ఇచ్చిన నేతలు మిగతా డబ్బులు ఇవ్వలేదు. దీంతో నారాయణ గురువారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు వెంటనే అప్రమత్తమై బాధితుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

తొలి ఓటు కోసం బెంగళూరు నుంచి రాక



భిక్కనూరు: తొలి ఓటు వేసేందుకు ఓ యువతి బెంగళూరు నుంచి విమానంలో వచ్చింది. భిక్కనూరుకు చెందిన గజ్జె శ్రీవాణి, భిక్షపతి దంపతుల కూతురు శ్రీలేఖ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఓటు వేసేందుకు ఇంటికి రావాలనుకోగా బస్ టికెట్లు దొరకలేదు. దీంతో గురువారం ఉదయం బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమానంలో వచ్చి అక్కడి నుంచి బస్సులో భిక్కనూరుకు చేరుకుని ఓటు వేసింది. తొలిసారి ఓటు వేసినందుకు సంతోషంగా ఉందని ఆమె 'సాక్షి'తో పేర్కొంది.

టెండర్ ఓటు వేసిన దీక్షిత



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన ఎస్ దీక్షిత ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే ఆమె ఓటు వేసినట్లు ఎన్నికల అధికారులు చెప్పారు. దీంతో తన ఓటును వేరే వాళ్లు ఎలా వేస్తారని, తొలిసారి తాను ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటానని ఆమె పట్టుబట్టారు. దీంతో దీంతో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బ్యాలెట్ పేపర్ ద్వారా ఆమెకు టెండర్ ఓటు వేసే అవకాశం కల్పించారు.

యువకుడిపై కేసు

ఇందల్వాయి మండలం రంజిత్ నాయక్‌తండా పంచాయతీ పరిధిలోని త్రయంబక్‌పేట్ తండాలో 150వ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తుండగా ఈవీఎంని ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.



అచ్చంపేటలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



80.22%

ప్రశాంతంగా సాగిన పోలింగ్

- ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్లు
- మందకొడిగా మొదలై తర్వాత జోరుందుకున్న ఓటింగ్ ప్రక్రియ
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు
- ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి, ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. అభ్యర్థులు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా గతంలోకన్నా కాస్త ఓటింగ్ తగ్గడం గమనార్హం. – సాక్షి, కామారెడ్డి

జిల్లాలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, పల్లెల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటేశారు. పోలింగ్ మందకొడిగా షురూ అయినా.. తర్వాత ఓటర్లు కేంద్రాలకు పోటెత్తారు. అక్కడక్కడా ఏవీఎంలు మొరాయించాయి. కొన్ని చోట్ల వివిధ పార్టీల నాయకులు కేంద్రాల దగ్గరి దాకా రావడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. సీఎం కేసీఆర్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో పలుచోట్ల చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. మిగతా చోట్ల ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. జిల్లాలో 80.22 శాతం పోలింగ్ నమోదు కాగా నిజామాబాద్ జిల్లాలో 73.72 శాతం ఓటేశారు.

చెదురుమదురు ఘటనలు..

జిల్లాలో పలు ప్రాంతాలలో చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల ఆవరణలోకి కారులో వెళ్లడంతో బీఆర్‌ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. మున్సిపాలిటీ, బాలుర ఉన్నత పాఠశాలల వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు



నిజాంసాగర్‌లో బారులు తీరిన ఓటర్లు

ముజీబొద్దీన్, నిట్టు వేణుగోపాల్‌రావ్‌ల ఆధ్వర్యంలో కొండల్‌రెడ్డితో గొడవకు దిగగా పోలీసులు వారిని పక్కకు తీసుకువెళ్లారు. బీఆర్‌ఎస్ నేతలు పోలీసుల వైఖరిని నిరసిస్తూ రోడ్డుపై బైటాయించారు. దీంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. బీబీపేటలో ఒక ఈవీఎం మొరాయించడంతో మార్చారు.

దోమకొండలో పోలింగ్ ఉదయం మందకొడిగా ఉన్నా క్రమంగా ఓటర్లు భారీగా తరలివచ్చారు. కామారెడ్డి పట్టణంలో ఓటర్లు బారులు తీరి కనిపించారు. అయితే కుటుంబంలో ఒకరికి ఒక కేంద్రంలో, ఇంకొకరికి ఇంకో కేంద్రంలో ఓటు ఉండడంతో ఇబ్బంది పడ్డారు. బాన్సువాడ నియోజకవర్గంలోని చిన్నరాంపూర్‌లో ఈవీఎం మొరాయించింది. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండలం హజ్గుల్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య గొడవ జరగ్గా పోలీసులు చెదరగొట్టారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డిలో రెండు ప్రధాన పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రానికి సమీపంలో టెంట్లు వేసుకుని గుమిగూడడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దీంతో ప్రజలు పరుగులు తీశారు.

అందరిలోనూ గెలుపు ధీమా....

పోలింగ్ ముగియడంతో గెలుపు, ఓటములపై అంతటా చర్చ నడుస్తోంది. ఎగ్జిట్ పోల్ సర్వేలు ఒకవైపు, సొంత సర్వేలు మరోవైపు.. అభ్యర్థులు రెండింటిని బేరీజు వేసుకుంటున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోనూ పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

తగ్గిన పోలింగ్..

జుక్కల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికలలో 85.29 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 81.61 శాతమే ఓట్లేశారు. ఎల్లారెడ్డిలో క్రితంసారి 86.08 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి 83.16 శాతం, కామారెడ్డి నియోజకవర్గంలో గతంలో 78.24 శాతం ఓట్లేయగా ఈసారి 74.86 శాతం, బాన్సువాడలో 2018లో 83.66 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి 81.26 శాతం ఓట్లు నమోదయ్యాయి.

ఓటేసిన అభ్యర్థులు, ప్రముఖులు..

బీజేపీ కామారెడ్డి అభ్యర్థి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ కామారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తన సొంతూరు బస్వాపూర్‌లో ఓటేశారు. టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ చిన్నమల్లారెడ్డిలో ఓటు వేశారు. బాన్సువాడ నుంచి మరోసారి బరిలో నిలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన సొంతూరు పోచారంలో, బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ నిజామాబాద్ నగరంలో, కాంగ్రెస్ అభ్యర్థి తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డినుంచి బరిలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ తన సొంతూరు నల్లమడుగులో, బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి ఎల్లారెడ్డి పట్టణంలో ఓటు వేశారు. జుక్కల్ నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే డోన్‌గావ్‌లో, బీజేపీ అభ్యర్థి అరుణతార బిచ్కుందలో, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంత్‌రావ్ పిట్లంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జిల్లాలో ప్రతి రెండు గంటలకు నమోదైన పోలింగ్ శాతం వివరాలు..

నియోజకవర్గం	9 గంటలకు	11 గంటలకు	1 గంటకు	3 గంటలకు	5 గంటలకు
జుక్కల్	07.43	22.43	43.24	57.43	81.61
ఎల్లారెడ్డి	11.02	25.24	45.61	62.70	83.16
కామారెడ్డి	11.09	26.02	34.52	57.16	74.86
బాన్సువాడ	13.36	28.51	53.20	62.15	81.26

పోలింగ్ బూత్‌ల సందర్శన

అభ్యర్థులు తమ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి జంగంపల్లితోపాటు కామారెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, ఇతర సహాయకులతో ఆయన మాట్లాడారు.



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సంఘమేశ్వర్‌లో మొరాయించిన ఈవీఎం



దోమకొండ మండలం సంఘమేశ్వర్‌లో పోలింగ్ ముగిసే సమయంలో ఉన్న క్యూ

దోమకొండ మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో 106 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించింది. మధ్యాహ్నం ఒంటి గంటనుంచి 2 గంటల వరకు పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు భారీగా బారులు తీరారు. అధికారులు వీవీప్యాట్‌ను మార్చి ఈవీఏంను సరిచేశారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి దాదాపు 400 మంది ఓటర్లు క్యూలో ఉన్నారు. దీంతో అధికారులు గేటుకు తాళంవేసి, లోపల ఉన్న ఓటర్లందరికి ఓటు వేయడానికి అవకాశం కల్పించారు.



కామారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి



పోచారంలో బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి



నిజామాబాద్‌లో బాన్సువాడ బీజేపీ అభ్యర్థి యెండల



ఎర్రాపహాడ్‌లో బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు,



పిట్లంలో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంత్‌రావ్



ఎల్లారెడ్డిలో బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి,



నల్లమడుగులో బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల,



బిచ్కుందలో బీజేపీ అభ్యర్థి అరుణతార,



దోన్‌గావ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే,



సిర్‌పూర్‌లో ఓటేస్తున్న ఎంపీ బీబీ పాటిల్



మహమ్మద్‌నగర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ శోభ కుటుంబ సభ్యులు..



బస్వాపూర్‌లో ఓటేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



జిల్లాకేంద్రంలో ఓటు వేస్తున్న కలెక్టర్ పాటిల్



కామారెడ్డిలో ఓటు వేసిన ఎస్పీ సింధుశర్మ

క్లుప్తంగా

తన కోసం తన ఓటు..

మోర్తాడ్: బీజేపీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మకు ఈ ఎన్నికల్లో కొత్త అనుభవం ఎదురైంది. గడిచిన ఎన్నికల్లో తనకోసం తన ఓటును ఏనాడూ వినియోగించుకోలేదు. దీనికి కారణం ఆర్మూర్‌లో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆమె బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో ఓటు ఉండడమే ప్రధాన కారణం. గడిచిన 1994, 1999, 2004లో నిర్వహించిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తూ వచ్చారు. 2009లో ఓటు హక్కును వినియోగించుకోలేదు. 2014లో టీడీపీ, బీజేపీ బాల్కొండ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమారుడి కోసం తన ఓటు హక్కును వినియోగించారు. ఈ ఎన్నికల్లో బాల్కొండ నుంచి పోటీ చేస్తుండడంతో తొలిసారి తన కోసం తన ఓటును వినియోగించారని చెప్పొచ్చు.

ఓటు వేసిన మాలావత్ పూర్ణ



సిరికొండ: మండలంలోని పాకాల గ్రామంలో ఎవరెస్ట్‌ను అధిరోహించిన మాలావత్ పూర్ణ గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తల్లిదండ్రులు లక్ష్మీ, దేవీదాస్‌లతో కలిసి ఓటు వేశారు.

కామారెడ్డి ఓటర్లు చైతన్యవంతులు

- కారు గ్యారేజీకి పోయింది
- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి



భిక్కనూరు: కామారెడ్డి ఓటర్లు చైతన్యవంతులని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ బూతులను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశమంతా కామారెడ్డి అసెంబ్లీ వైపు చూసిందని, కామారెడ్డి ప్రజలు కసితో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. కామారెడ్డితో పాటు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి తథ్యమని 'కారు' గ్యారేజీకి పోయిందన్నారు. ఇంజిన్ పూర్తిగా చెడిపోయిందని నవ్వుతూ అన్నారు. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి 10 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు ఓటమి చూపిస్తున్న కామారెడ్డి ప్రజలకు తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. నేతలు బల్యాల సుదర్శన్, అందే దయాకర్‌రెడ్డి, టీపీ విజయ్ కుమార్ గౌడ్, కల్లూరి సిద్ధరాములు ఉన్నారు.

బోధన్‌లో సీపీ పర్యటన

బోధన్‌టౌన్ : బోధన్‌లోని పోలింగ్ బూత్‌ల ను గురువారం సీపీ కల్మేశ్వర్ పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిని ప్రశ్నించారు. శక్కర్‌నగర్ కాలనీలో డబ్బులు పంచుతున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తన ఓటు మరొకరు వేశారని వచ్చిన సంధ్యా అనే మహిళతో మాట్లాడారు. ఓటు ఎవరు వేశారో తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని ఆయన తెలిపారు. రెండు చోట్ల డబ్బులు పంచుతున్న వారిని పట్టుకున్నామని వివరించారు. ఒకరి ఓటు మరొకరు వేశారని తమ దృష్టికి వచ్చిందని వెబ్ కెమెరాలను పరిశీలిస్తామని తెలిపారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ గిరిరాజ్, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

- పోలింగ్ సరళి తెలుసుకున్న అభ్యర్థులు
- ఏర్పాట్ల పరిశీలన



ముస్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డితో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, కామారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం, అక్కడి నుంచి ఇందిరానగర్, రాజీవ్ నగర్, గర్ల్స్ హైస్కూల్, బీసీ బాయ్స్ హాస్టల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీసీ బాయ్స్ హాస్టల్ ముందు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక నేతలతో చర్చించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, నాయకులు చందు తదితరులున్నారు.

జంగంపల్లిలో ..

భిక్కనూరు: జంగంపల్లిలో పోలింగ్ కేంద్రాలను కామారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళి గురించి పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయని విలేకరులు ఆయనను అడుగగా ఆయన నవ్వుతూ నో కామెంట్ అన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ రావు గురువారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపాలిటీలో గల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

బాన్సువాడలో..



బీర్కూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందితో మాట్లాడారు. ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు ఉండే చోట్ల చీకటిగా ఉండడంతో గుర్తులను చూసేందుకు ఓటర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, వెలుతురులో ఈవీఎంలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

మద్నూర్‌లో..



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండలంలో పోలింగ్ ఎలా జరుగుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే తెలుసుకున్నారు. మండల కేంద్రంలో గురువారం సింధే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పోలింగ్ సజావుగా జరిగేటట్లు సహకరించాలని ఓటర్లు అభివృద్ధి చేసిన వారికే బ్రహ్మరథం పడతారని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఆయన సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

'ఏనుగు' కారు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన కారు అద్దాలు

బాన్సువాడ: బుడ్మి గ్రామంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసమ అయ్యాయి. గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు కొట్టారని ఏనుగు రవీందర్‌రెడ్డికి సమాచారం అందడంతో అర్ధరాత్రి ఒంటి గంటకు గ్రామానికి వెళ్లారు. బీఆర్‌ఎస్ నాయకులే పోలీసులకు సమాచారం ఇచ్చి కాంగ్రెస్ కార్యకర్తలకు కొట్టించారని రవీందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులకు కాంగ్రెస్ అభ్యర్థికి మధ్య జరిగిన వాగ్వివాదంలో గుర్తు తెలియని వ్యక్తులు రవీందర్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు.

శెట్పల్లిసంగారెడ్డిలో లాఠీచార్జి



గాయపడిన దుర్గయ్య

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డిలో గురువారం జరిగిన లాఠీ చార్జిలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. పోలింగ్ బూతు వద్ద ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసే ప్రదేశంలో ఓటర్లు గుమిగూడడంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు లాఠీచార్జ్ చేశారు. గుంపులుగా గుమిగూడడంతో పలుమార్లు జనాలు అక్కడి నుంచి వెళ్లాలని హెచ్చరించినా వినిపించుకోకపోవడంతో లాఠీచార్జ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో పలువురు నాయకులకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దుర్గయ్య, గ్రామ సర్పంచ్ అనిల్‌రెడ్డి, మోహిద్, కిరణ్, కుమార్‌లకు గాయాలైనట్లు తెలిపారు. ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఇసన్నపల్లిలో అకారణంగా లాఠీచార్జి

భిక్కనూరు: ఇసన్నపల్లిలో పోలీసులు గురువారం అకారణంగా లాఠీచార్జి చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద గుమిగూడి ఉన్న పార్టీల నేతలు, కార్యకర్తలను చెదరగొట్టేందుకు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఎలాంటి గొడవ లేకున్నా ఎందుకు లాఠీచార్జి చేశారని పోలీసులను గ్రామస్తులను ప్రశ్నించారు. కావాలని లాఠీచార్జీ చేయడం ఎంతవరకు సమంజసమంటూ గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేయడంతో పోలీసులు గ్రామస్తులకు సర్దిచెప్పారు.

హజ్గుల్‌లో ఘర్షణ



గుమిగూడిన ఇరుపార్టీల కార్యకర్తలు

బిచ్కుంద(జుక్కల్): హజ్గుల్‌లో పోలింగ్ కేంద్రం స మీపంలో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య మాటామాట పెరిగి కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్నా రని ఒకరిపై ఒకరు ముగ్గురు పార్టీల కార్యకర్తలు వి మర్శలు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు చేరుకొని గుంపులుగా ఉన్న వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపించారు.

కామారెడ్డిలో గెలిచేదెవరు?

- ఉత్కంఠ రేపుతున్న పోరు
- ఫలితంపై జోరుగా చర్చలు

సాక్షి, కామారెడ్డి: రాష్ట్రంలోనే హాట్ సీటుగా మారిన కామారెడ్డి నియోజకవర్గంలో గెలుపు ఎవరిదన్న అంశంపై అంతటా చర్చ నడుస్తోంది. ఇక్కడ సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడి బరిలో నిలిచారు. సాధారణంగా సీఎం పోటీ చేస్తున్నాడంటేనే ఎన్నిక ఏకపక్షంగా ఉంటుందని భావిస్తారు. మరోవైపు ఇదే స్థానంనుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా పోటీ చేయడంతో అందరి దృష్టి కామారెడ్డివైపు మళ్లింది. అయితే బీజేపీ అభ్యర్థి ఇద్దరు ముఖ్య నేతలతో తలపడి నిలబడడం ఉత్కంఠ రేకెత్తించింది. ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ దాకా అంతటా కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి గెలుపు అవకాశాల గురించిన చర్చే జరిగింది. సీఎం కేసీఆర్ తరపున మంత్రి కేటీఆర్ పలుమార్లు నియోజకవర్గంలో పర్యటించారు. సభలు, రోడ్‌షోలతో హోరెత్తించారు. అలాగే రేవంత్‌రెడ్డి కూడా రోడ్‌షోలు, సభలతో జనంలోకి వెళ్లారు. జిల్లాకేంద్రంలో రాహుల్ గాంధీ సభ నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఒక్కడే నియోజకవర్గాన్ని చుట్టేశారు. ప్రధాని నరేంద్రమోదీ సభతో కాషాయ సేనలో జోష్ పెరిగింది. మూడు పార్టీలు విజయం కోసం శ్రమించడంతో ముక్కోణపు పోటీగా మారింది. ప్రచారంతోపాటు పోలింగ్ సరళి కూడా మూడు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నరీతిలో నడిచింది. ముక్కోణపు పోరులో గెలుపు తనదేనన్న ధీమాలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఉన్నారు. కాగా సీఎం కేసీఆర్ గెలుస్తాడని బీఆర్‌ఎస్ నేతలు అంటుండగా, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గెలుస్తాడని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

జోరుగా బెట్టింగులు...

కామారెడ్డిలో ఎవరు గెలుస్తారన్నదానిపై జోరుగా బెట్టింగులు నడుస్తున్నాయి. జిల్లాలోనే కాదు దేశ విదేశాల్లోనూ బెట్టింగులు కడుతున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా తెలిసినవారు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ఫోన్‌లు చేసి ఎవరు గెలుస్తారో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్న పలువురు.. వారి అభిప్రాయాల ఆధారంగా బెట్టింగ్‌లు కాస్తున్నట్లు సమాచారం. ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈనెల 3వ తేదీన ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

యువ ఓటర్ల నూతనోత్సాహం

గర్వంగా ఉంది



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మొదటి సారి ఓటు వేయడం గర్వంగా ఉంది. నా చేతిలోనే ప్రజా పాలన ఉందని సంతోషంగా అనిపించింది. కొంత మంది ఓటు హకు వినయోగించుకోవడానికి వెనకాడుతున్నారు. అటువంటి వారి వల్ల పాలన అస్తవ్యస్తంగా మారింది. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి హక్కు.

– సందర్శిని, నస్రుల్లాబాద్

నా ఆయుధం కోసం ఎదురు చూశా



ఓటు హక్కు సామాన్యుడి ఆయుధం. అందుకోసం ఎదురు చూశాను. సమయం రాగానే ఓటు వేసి వినియోగించుకున్నాను. దీని కోసం హైదరాబాదు నుంచి వచ్చాను. సంతోషంగా ఉంది.

– శ్రావణ్య, నెమ్లి

నా ఓటుతో సమాజ హితం



మొదటి ఓటు వేయడం సంతోషంగా ఉంది. దీనిని సమాజ హితం గురించి స్వంతంగా ఆలోచించి వినియోగించాను. ఓటును ఎవరి ఒత్తిడితో వినియోగించడం సరి కాదని నా అభిప్రాయం.

– కిరణ్మయి, నస్రుల్లాబాద్

కొత్త అనుభూతి కలిగింది



నాకు ఈ ఎన్నికలల్లోనే కొత్తగా ఓటుహక్కు వచ్చింది. మొదటిసారి ఓటు వేస్తుంటే కొత్త అనుభూతి కలిగింది. ఓటు హక్కు ఎంతో విలువైందని పెద్దలు చెబుతుంటే వినేదాన్ని. కానీ ఇప్పుడు ఓటుహక్కు వినియోగించుకుంటే దాని విలువెంతో ఉందని తెలిసింది. ప్రతి ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటాను.

– కుంచారపు శివాని, నాగిరెడ్డిపేట

ఓటు విలువ తెలిసింది



ఇది వరకు ఓటుహక్కు విలువైందని చెబుతుంటే చాలాసార్లు విన్నాను. కానీ ఈ ఎన్నికల్లో తొలిసారి నేను ఓటు హక్కు వినియోగించుకోవడంతో అది నిజమని తెలిసింది. పండు ముసలివారు సైతం ఓటు వేసేందుకు వస్తుంటే ఓటు చాలా విలువైందనిపిస్తుంది. ప్రతి ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నేను ఓటు హక్కును వినియోగించుకుంటాను.

– తలకొక్కుల రామకృష్ణ, బీనూర్

ఎవరి ధీమా వారిదే..

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఓటింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు.. గెలుపోటములపై బేరీజు వేసుకుంటున్నారు. గెలుపుపై ఎవరి ధీమాలో వారున్నారు.

చరిత్ర సృష్టించబోతున్నాం



పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో కేంద్రాల వద్ద పండుగ వాతావరణం కనిపించింది. గత ఆరుసార్లకంటే ఈసారి భారీ మెజారిటీతో గెలిచి, చరిత్ర సృష్టించబోతున్నాం.

– పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, బాన్సువాడ

కాంగ్రెస్ వైపు ఆకర్షితులయ్యారు



మా మేనిఫెస్టోతో ప్రజలు కాంగ్రెస్‌వైపు ఆకర్షితులయ్యారు. బాన్సువాడలో ఈ సారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్నాం. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుంది. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, బాన్సువాడ

కాషాయ జెండా ఎగురవేస్తున్నాం



బాన్సువాడలో ఈసారి కాషాయ జెండాను ఎగరవేస్తున్నాం. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారు. కచ్చితంగా బాన్సువాడ గడ్డపై కమలం వికసిస్తుంది. ఎన్నికల్లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ అభ్యర్థి, బాన్సువాడ

నలభై వేలపైనే..



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితో ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలవడం పక్కా. ఈ ఎన్నికలలో నాకు 40 వేలపైనే మెజారిటీ వస్తుందని భావిస్తున్నా.

– హన్మంత్‌సింధే, జుక్కల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

భారీ మెజారిటీతో గెలుస్తా



మార్పు కోసం ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచారు. బీఆర్‌ఎస్ పార్టీ డబ్బులు, మద్యం పంపిణీ చేసినా ఓటర్లు అమ్ముడు పోలేదు. ఓటర్లు కాంగ్రెస్ వైపు ఉన్నందున భారీ మెజారిటీతో గెలుస్తానని నమ్ముతున్నా.

– లక్ష్మీకాంత్‌రావ్, జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి

బల్దియా వద్ద ఉద్రిక్తత..



వాగ్వాదానికి దిగుతున్న కొండల్‌రెడ్డి, ముజీబొద్దీన్

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల వివాదం తలెత్తడం ఆందోళనలకు గురిచేసింది. దాదాపు గంటపాటు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి వాహనం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చింది. వాహనంలో ఆయనతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు వారిని అడ్డుకున్నారు. స్థానికేతరులు వెళ్లిపోవాలంటూ వాగ్వాదానికి దిగారు. ఇది కాస్త ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. పోలీసులు సముదాయించేందుకు ప్రయత్నించారు. స్థానికేతరుడు కావడంతో కొండల్‌రెడ్డి పీఏ కృష్ణారెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ వెంటనే కొండల్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. అక్కడ సైతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పోగయ్యారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో డీఎస్పీ ప్రకాష్, సీఐ నరేష్, పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారంటూ బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైటాయించి దాదాపు అరగంటపాటు ధర్నా చేశారు. పోలీసులు సర్దిచెప్పడంతో అక్కడి నుంచి ఇరువర్గాలు వెళ్లిపోయారు.

ఇంకు పోశారన్న ఆరోపణలతో..

జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం ప్యాడ్‌పై ఇంకు పోశారన్న ప్రచారంతో బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చారు. డీఎస్పీ ప్రకాష్, పట్టణ సీఐలు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. టెక్నికల్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఓ ఓటరు ఇంకుతో వేలిముద్ర వేశాక అదే వేలితో ఓటు వేయడంతో ఇంకు మరకలు గుర్తుపై పడ్డాయని గుర్తించి, ఆ మరకను తుడిచివేశారు. ర్వాత పోలింగ్‌ను యథావిధిగా కొనసాగించారు.

క్రైం కార్నర్

ఓటేసి వెళ్తూ వృద్ధుడి మృతి



భోజన్న (ఫైల్)

నిజామాబాద్ రూరల్: ఓటు హక్కును వినియోగించుకొని ఓ వృద్ధుడు ఇంటికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన రూరల్ మండలంలోని పాల్దా గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పాల్దా గ్రామానికి చెందిన భోజన్న(75) తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. భోజన్న మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ ఒకరు..



నీలకంఠం (ఫైల్)

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన పెండెం నీలకంఠం(42) నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సైకృష్ణకుమార్ గురువారం తెలిపారు. ఈనెల 25న నీలకంఠం తన వ్యవసాయ పొలంలో క్రిమిసంహారకమందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మందు గొంతులోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సోనాలలో జింక మృతి



మృతి చెందిన జింక కళేబరం

మద్నూర్(జుక్కల్): మండలంలోని సోనాల గ్రామానికి వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం పేర్కొన్నారు. రహదారిపై జింక పడి ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. ఐదు రోజుల క్రితం మద్నూర్ సమీపంలో ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. వారంలో రెండు జింకలు మృతి చెందాయని అటవీశాఖ అధికారులు రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవని గ్రామస్తులు పేర్కొన్నారు.

క్యూలో ఫిట్స్ వచ్చి గాయాలు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఓటరుకు ఫిట్స్ వచ్చి కిందపడిపోవడంతో తలకు గాయమైంది. పట్టణంలోని గడిరోడ్‌లో నివాసం ఉంటున్న సత్యం ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. కింద పడిపోగా తలకు గాయమై రక్తస్రావం అయ్యింది. స్థానిక పోలింగ్ సిబ్బంది 108కు సమాచారం ఇవ్వడంతో 20 నిమిషాల అనంతరం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓటు వేయకుండా సత్యం, అతని భార్య వెనుదిరిగారు.

ఫిట్స్‌తో కిందపడిపోయిన సత్యం

పోలింగ్ కేంద్రాల వద్ద లాఠీచార్జి

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని 16, 17, 39, 41, 42 డివిజన్లలో బీజేపీ కార్యకర్తలు, ఓటర్లపై పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడారని గంగస్థాన్, సుభాష్‌నగర్, దుబ్బలో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దీంతో అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలతో పాటు ఓటర్లకు గాయాలయ్యాయి. అంతేగాకుండా ఓటర్ లిస్టులను చించేశారని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. లాఠీచార్జితో గాయపడ్డ వారిని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. పోలీసులు బీజేపీ నాయకులు, ఓటర్లపై లాఠీచార్జి చేయడాన్ని ధన్‌పాల్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో హిందువుల ఓట్ల శాతం తగ్గించేందుకు పోలీసులు బీఆర్‌ఎస్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. హిందువుల ఓట్లు అధికంగా నమోదవుతున్న పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఓటేయకుండా భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. మహిళలని చూడకుండా కొట్టారన్నారు. ఆరెంజ్ రంగు చొక్కాలు, చీరలు కట్టుకున్న వారిని వెంటనే మార్చేయాలని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ గెలుస్తుందనే ఫ్రస్టేషన్‌లో పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మైనారిటీ ఏరియాల్లో స్వేచ్ఛగా వదిలేస్తూ.. హిందువులు అధికంగా ఉన్న కేంద్రాల్లో నిబంధనలు కఠినంగా అమల్జేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారితోపాటు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కొండా ఆశన్న, విజయ్ కృష్ణ ఉన్నారు.